
# పద్మశ్రీ సుబ్బారావు

– కస్తూరి రామశర్మ

సుబ్బారావు ఒక జర్నలిస్టు. జర్నలిజంలో డిగ్రీ పొందాడు. చిచింద్రీ పత్రికకు సంపాదకుడు. రోజు రోజుకి సమాజంలో పెరిగిపోతున్న కుళ్లు (అవినీతి, లంచ గొండి తనం, రాజకీయ పక్షపాతం మతద్వేషం) బయట పెట్టడం అతని ధ్యేయం. అతను అంటే ఉద్యోగస్తులకు, రాజకీయ నాయకులకు, మినిష్టర్లకు చాలా భయం. వాళ్లు అతనిని మంచి చేసుకొనుటకు యిచ్చే పార్టీలు వగైరా అంగీకరించేవాడు కాదు. అతనిని వార్తల సుబ్బారావు అనే వారు. పోలీసులు సలాం కొట్టేవారు. కలెక్టరు పోష్ లొకాలిటీలో మంచి ఇంటి స్థలం ఇస్తే తిరస్కరించాడు. స్లమ్సులో పేదలు ఇళ్లు లేక బాధపడుతూ వుంటే తాను ఇంటి స్థలం తీసుకొనడం అనుచితము అన్నాడు. అతను స్పందించిన కొన్ని సందర్భాలు :



మూగ జంతువుల పరి రక్షణ సంస్థ సభ్యురాలు తన పెంపుడు కుక్కని ఊర కుక్కలు గ్యాంగు రేప్ చేసి చంపి వేశాయని అంది. ఊర కుక్కలు సాధారణంగా ఆసుపత్రుల చుట్టూ తిరుగుతాయని, పురిటి పిల్లలను పట్టుకొని పోయి తినేస్తున్నాయని, ఆసుపత్రుల దగ్గర సరైన రక్షణ వుండదని, చిన్న పిల్లలను కరిచి వేస్తున్నాయని, సరైన మందులు. ఇన్‌జక్షన్లు ఆసుపత్రులలో వుండవని, ఊర కుక్కలను నిర్మూలించే బాధ్యత కార్పరేషను వారిది కనుక వారు వారి బాధ్యత సక్రమముగా నిర్వర్తించలేక పోవుట చేత, కుక్క యజమానురాలికి కార్పరేషను వారు నష్టపరిహారం చెల్లించాలని పత్రికలో వ్రాసి సంచలనం సృష్టించాడు. దానికి కార్పరేషను వారు స్పందిస్తూ అది చిత్తకార్తి అని మగ కుక్కలు పది కూడి వాసన చూసి చిత్తినిజాతిని ఇట్టే పసికట్టేస్తాయని, అది ప్రకృతి సహజం అని, పద్మిని జాతి జోలికి పోవని, అందుకు కార్పరేషన్‌ది ఎంత మాత్రం బాధ్యత కాదని అన్నారు. పైగా సుబ్బారావు ఇంటికి వాటరు సప్లై నిలుపు చేశారు. అతని ఇంటి ముందు లారీతో చెత్త పోయించారు. ఇంటి పన్ను పెంచారు. అక్రమంగా నీరు వాడుకున్నా డని కేసు కూడా పెట్టారు. మరొక సారి ఎలక్ట్రికల్ డిపార్టుమెంటు వారు కొత్త కనెక్షన్లు ఇవ్వడానికి మామూళ్లు వసూలు చేస్తున్నారని వ్రాశాడు. దానితో వాళ్లు రెచ్చిపోయి అతని ఇంటి కనక్షన్ డిస్‌కనెక్టు చేసి కరెంటు ఫిల్ ఫర్ చేస్తున్నాడని కేసు పెట్టారు. కరెంటు బిల్లు కూడా హెచ్చు చేశారు. పోలీసు స్టేషన్‌లో కష్టడిలో వున్న ఒక వ్యక్తి మరణించాడు. పోలీసు వారు ఉరి పోసుకొని చచ్చాడు అన్నారు. కాదు, అది లాకప్‌డెత్తు అని పేపరులో వ్రాశాడు. పోలీసు వాళ్లు ఇది వరలో చాలా మంది నీలాంటి వాళ్లు పైకి వెళ్లిపోయారు. జాగ్రత్త, అని వార్నింగు ఇస్తూ, ఇక ముందు పిచ్చి పిచ్చి వ్రాతలు వ్రాయకు అన్నారు. ఇంకొకసారి రేషను షాపులలో నాసి రకం సరుకులు ఇస్తున్నారని, తక్కెడలో సరుకులు వేసినా వెంటనే ముల్లు నిలకడగా వుండకముందే సరుకులు తక్కెడ నుంచి తీసి వేస్తున్నారని, దానివల్ల తూకం తక్కువ వస్తున్నదని, కార్డు హోల్డర్లు ఇది గమనించక నష్టపోతున్నారని, నిత్యావసర సరుకులు బ్లాకు మార్కెట్టులో అమ్ముతున్నారని వ్రాశాడు. దానితో సివిల్ సప్లయర్స్ డిపార్టుమెంటు వారు రెచ్చిపోయి అతని రేషన్ కార్డు కాన్సిల్ చేశారు. ఇవిగాక చాలా స్కాములు బయట పెట్టాడు. విచారణలు జరుగుతున్నాయి. విచారణలు పూర్తి అయి, నిందితులు శిక్షింపపడతారన్న నమ్మకం లేదు. ఇల్లాగ ఎదురు దెబ్బలు తింటున్నా సుబ్బారావు తన ధోరణి మార్చుకొనలేదు. ప్రజల మెప్పు పొందుతూనే వున్నాడు.

ఒక రోజు వార్తలు సేకరించడానికి మెడలో కెమెరా తగిలించుకొని, ఊరిలోకి బయలుదేరాడు. ఒక భవనం ముందు "సీనియరు సిటిజన్సు, వయో వృద్ధుల విశ్రాంతి నిలయం' బోర్డు చూశాడు. అక్కడ తనకు కావలసిన మందు గుండు దొరుకుతుందని లోపలికి దూరాడు. అందులో వయో వృద్ధులు 60 నుంచి సుమారు 100 సంవత్సరములవారు, మగ, ఆడ చాలా మంది ఉన్నారు. వాళ్లు గుంపులు గుంపులుగా కూడి, వార్తా పత్రికలు పుస్తకాలు భగవద్గీత, రామాయణ భారతం వగైరాలు చదువుతున్నారు. కొంతమంది టి.వి. చూస్తున్నారు. కొంతమంది స్త్రీలు ఒక పక్కన కూడి, స్త్రీలకు ఆస్థి హక్కుల గురించి, రోజు రోజుకి పెరిగిపోతున్న కట్న కానుకలు గురించి, ప్రేమ వివాహాలు గురించి, విడాకుల గురించి స్త్రీలపై అత్యాచారాలు గురించి, ఉమెన్ రిజర్వేషను బిల్లు గురించి, పురుషాధిక్యత గురించి, కోడళ్లు అత్తమామలను పెట్టే బాధలు గురించి, మాట్లాడుకుంటున్నారు. అందులో 80 సంవత్సరాల రామలక్ష్మి అంటుంది. "మన కాలంలో కాడి ఎద్దులలాగా గంపెడు పిల్లలతో బేధాభిప్రాయాలు లేకుండా సంసారంతో నెగ్గుకొచ్చాము. కానీ పురుషాధిక్యత అన్నమాట ఎన్నడూ వినలేదు". సుబ్బలక్ష్మి మాట్లాడుతూ, "మా కోడలు, కోడలు కాదు తల్లీ! కొరివి! లేనిపోని నిందలు మోపి మావాడి మనస్సు విరిచేసింది. 90 సంవత్సరాల తండ్రి వంటి మామగారిని, కూతురిగా చూసుకుంటూ పేరు పెట్టైయినా పిలవకుండా, అమ్మా, అమ్మా అని సంబోధిస్తున్న మామగారి మీద లేనిపోని నిందలు మోపి, పైకి భక్తుడి వేషాలు లోపల నికృష్టమైన ఆలోచనలు" అని అంది. కొంతమంది మగవాళ్లు గవర్నమెంటు పనితీరు గురించి, రాజకీయ పార్టీలు గురించి చర్చించుకుంటున్నారు. మన సుబ్బారావు అక్కడకు వెళ్ళాడు. అక్కడ కామశాస్త్రి అనే 90 సంవత్సరముల వృద్ధుడు "మీరు ఎవరు, ఇక్కడ మీకు ఏమి కావాలి?" అని అడిగాడు. నేను జర్నలిస్టు సుబ్బారావుని. చిచింద్రీ సంపాదకుడుని. మీ కష్టసుఖాలు తెలుసుకుందామని వచ్చాను.

పేరు సమాజానికి వెన్నుముకలాంటివారు. రాను రాను మీ సంఖ్య పెరిగిపోతున్నది. మీలో చాలామంది నిరాదరణకు గురి అవుతూ, ఓల్డ్ హోమ్స్‌లో చేరిపోతున్నారు. ఓల్డ్ హోమ్స్ అక్కడక్కడ పెడుతున్నారు. చాలడం లేదు. దీనికంతకు కారణం ఏమిటి అంటారు తాతగారు" అని సుబ్బారావు అడిగాడు. కామశాస్త్రి కారణాలు చాలా ఉన్నాయి చెబుతాను రాసుకోండి. ఇప్పుడు నవతరం ఆలోచన వేరుగా ఉంది. పిల్లలు పెద్దవారైన తరువాత తల్లిదండ్రులు, వాళ్ళనుంచి ఏమీ ఆశించకూడదు అన్నది వాళ్ల అభిప్రాయం. ఇది ఏలాగుందంటే, చెట్టుని చిన్న మొక్క దగ్గర నుంచి, చీడ పట్టకుండా పెంచి తీరా ఫలసాయానికి వచ్చేసరికి పెంచినవాడు ఫలసాయం ఆశించకూడదని, దారిని పోయే వాళ్లు రాళ్లు కొట్టి ఆ ఫలాలు అనుభవించడానికే అన్నట్లు ఉంది. నువ్వు మీ నాన్నని, మీ నాన్న మీ తాతని, మీ తాత మీ ముత్తాతని, అతను అతని తండ్రిని, ఆ తండ్రి అతని తండ్రిని చూసారా? అని ప్రశ్నిస్తారు. దుష్ట పాశ్చాత్య సంస్కృతి పాశ్చాత్యులు పిల్లలని చిన్నప్పుడే మిషనెరీలకు అప్పగించేస్తారు. అందుకే మిషనరీలని ఫాదర్, మదర్ అని సంభోదిస్తారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను పెద్దవాళ్లు అయ్యేవరకు తెలియదు. పెద్దవాళ్లు అయిన తరువాత, వాళ్లని కన్న తల్లిదండ్రులు ఒకటిగా ఉండరు. తండ్రి సంవత్సరానికి ఒకరు చొప్పున విడాకులు ఇస్తూ మళ్లీ మళ్లీ పెళ్లి చేసుకుంటాడు. తల్లి కూడా అంతే. అందుచేత వాళ్లకి కన్న తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చూసే బాధ్యత ఉండదు. మన సంస్కృతి అటువంటిది కాదు. పిల్లలను పెంచి, విద్యాబుద్ధులు నేర్పించి, స్వతంత్ర జీవనోపాధి కలుగజేసి, పెళ్లి చేసి, భార్యకు భాధ్యత అప్పగించే వరకూ తల్లిదండ్రులదే భాధ్యత. పెద్ద అయిన తరువాత పిల్లలు తల్లిదండ్రుల బాధ్యత వహించాలి. భాగవతంలో కృష్ణుడు అంటాడు

"చెల్లు బడిగలిగి"

అనే పద్యం చదివినాడు, ఇది మన సంస్కృతి.

సుబ్బారావు "మీరు యీ వయస్సులో హాయిగా మనమలతోను మునిమనమలతోను, మీ అనుభవాలు కథలు కథలుగా వాళ్ళకు చెప్పుతూ ఉండక ఇక్కడకు ఎందుకు వచ్చారు. ఇక్కడ మీకు ప్రశాంతత ఉందా? మీ ధ్యాస మీ కొడుకులు కూతుళ్లు వాళ్ల పిల్లలమీద లేదా?

కామశాస్త్రి : లేకేమి నాయనా. 24 గంటలు వాళ్లే తలుపుకి వస్తూ ఉంటారు. నీటిలోని చేపని బయట పడవేసినట్లుంది. నా మనస్సు నా అధీనంలో ఉండదు. భగవద్గీతలో అర్జునుడు లాంటి వాడే అంటాడు. మనస్సు చంచలమైనది. వశపరచుకొనుట వాయువుని నిరోధించుటవలె చాలా దుష్కరం. నాబోటివాడికి మనస్సు ఎక్కడ నిలుస్తుంది? ప్రశాంతత ఎక్కడ నుంచి వస్తుంది?

సుబ్బారావు : మీ కొడుకు మిమ్మలని చూడడా మంచి వాడు కాదా?

కామశాస్త్రి భార్యావిధేయుడు. ఒకప్పుడు మన సంస్కృతి మాతృదేవోభవ, పితృదేవోభవ. ఇప్పుడు భార్య దేవోభవ. భార్య ఎలాగు చెబితే అలాగు నడచుకోవాలి. లేకపోతే హేపీ మారీడ్‌లైఫ్ అవదు విడాకులకు దారి తీస్తుంది. కానీ వాళ్ళని ముసలితనంలో అవకాశము ఉండి కూడా, దిక్కులేనివాళ్లుగా వదిలేయకుండా ఏజ్డ్ హోమ్స్‌కి నెట్టి వేయకుండా ఆదుకొంటాను.

సుబ్బారావు మీ కోడలు మిమ్ములని చూడదా?

కామశాస్త్రి : బాగుంది మీ ప్రశ్న. మాలాంటివాళ్లు ఇక్కడకు చేరడానికి ముఖ్య కారకులు కోడళ్లు, అంటే స్త్రీలు, ప్రక్కన ఉన్న స్త్రీలను అడగండి. కోడళ్లు వాళ్ళని ఎటువంటి బాధలు పెట్టారో చెప్తారు. కాపురానికి వచ్చిన దగ్గరనుంచి ముసలి అత్తమామలను ఎలాగ నెట్టివేయడమా అని ఆలోచిస్తారు. లేనిపోని నిందలు మోపి కొండీలు చెప్పి భర్తల మనస్సులను విరగదీస్తారు. వాళ్ల ద్వంద్వ ప్రవృత్తి వాళ్ల తల్లిదండ్రులను వాళ్ల వదినలు, మరదళ్లు బాగా చూడాలి. వాళ్లు మాత్రం ముసలి అత్త మామలను సరిగా చూడరు. మా కోడలు గురించి అడిగావు. ఆమె కూడా స్త్రీయే! వాళ్లకి ఆస్థిపాస్తులు ఇవ్వడానికి నా దగ్గర ఏమీ లేదని నిస్సాకారము, ఏహ్యాభావము. మీనుంచి మాకు చింకి చాపైనా లేకపోయినా నోటిని అదుపులో పెట్టుకొండి అంది. లేనిపోని నిందలు మోపి నాకు నా కొడుక్కి మధ్య జట్టీ పెట్టింది. వాడు జన్మనిచ్చిన తండ్రిని అని కూడా ఆలోచించకుండా, నన్ను స్కౌండ్రల్ అని తిట్టాడు. చింత చచ్చిన పులుపు చావదు అన్నట్లు, ఇన్ని ఏళ్లు వచ్చినా మాన అవమానాలకు చలించకుండా ఉండలేకపోతున్నాను. అయ్యా జర్మలిస్టుగారు, తెల్లవారి లేస్తే పత్రికలలో వయోవృద్ధులైన అత్త మామలను డౌరి కేసులలో ఇరికిస్తున్నారు. భగ్న ప్రేమికుల ఆత్మహత్యలు కూడా డౌరీ చావుల క్రింద తీసుకొచ్చి వయోవృద్ధులు ఏ పాపం ఎరుగని అత్తమామలను ఇరికిస్తున్నారు. కానీ కోడళ్లు అత్త మామలను బాధలుపెట్టి తిండిపెట్టక అవమానిస్తూ ఏజ్డ్ హోమ్స్‌కి నెట్టివేస్తున్నారు. ఇవి పేపర్లలో పడడం లేదు. ఇదివరలో అత్తలు కోడళ్లని కోడింటికం పెట్టేవారు అనేవారు. ఇప్పుడు కోడళ్లే అత్తలను అత్తింటికం పెడుతున్నారు. ఇవి మీ దృష్టికి రావా? వచ్చినా మీరు వాటికి ప్రాముఖ్యం ఇవ్వరా? ఒక ముఖ్య విషయం ఇక్కడకు వచ్చిన తరువాత క్రమేపి నేను వైరాగ్యంలో పడుతున్నాను. నేను ఖర్మ సిద్ధాంతం పూర్తిగా నమ్ముతాను. మనము చేసుకున్న కర్మకి ఫలం భగవంతుడు మనకు తిరిగి అందిస్తాడు.

ఏదో జన్మలో తల్లిదండ్రులను దుఃఖపెట్టి ఉంటాను. ఇప్పుడు ఆ ఫలం అనుభవిస్తున్నాను. ఇంతకన్నా మీకు ఏమి చెప్పలేను.

సుబ్బారావు వెళ్ళిపోయాడు యధాతథంగా ఇంటర్వ్యూ చిచీంద్రిలో ప్రచురించాడు.

ఆ తరువాత ఒక మంత్రి ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించాడని వ్రాసాడు. సంచలనం రేగింది. ఆ మంత్రి సుబ్బారావు మీద డిఫమేషన్ కేసు పెట్టాడు.

సాక్ష్యాలు లేక క్షమాపణ చెప్పుకొని కేసు నుంచి బయటపడ్డాడు. రాజకీయ నాయకులు పార్టీఫండు క్రింద డబ్బు వసూలు చేసుకుంటారు. శంఖంలో పోస్తే తీర్థమయినట్లు. దొరికిపోతే పార్టీఫండు అంటారు.

సుబ్బారావు ఆత్మ విమర్శన చేసుకున్నాడు. నిజం బయటపెట్టడం చాలా కష్టం అనుకున్నాడు. చాలామంది జర్నలిస్టులు ఉన్నది ఉన్నట్లు వ్రాయరు. పాము చావకూడదు కఱ్ఱ విరగకూడదు అన్న మాదిరిగా ఉంటారు. అబద్ధం నిజంగాను నిజం అబద్ధంగాను చిత్రించగలరు. సవ్యసాచులు నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు అన్నట్లు గోడమీద పిల్లి వాటంగా వ్రాస్తారు. మసిపూసి మారేడుకాయ చేస్తారు. అది సుబ్బారావుకి చేతకాలేదు. అందరిలా రంగులు మార్చలేడు. తనది ఒకటే రంగు. అందుచేత జర్నలిస్టుగా స్థిరపడలేకపోయాడు. స్వదేశ పార్టీ తన ఆశయాలు నెరవేరుస్తుందని ఆ పార్టీలో చేరాడు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. మంత్రి అయ్యాడు. పద్మశ్రీ బిరుదు ఇచ్చారు. పద్మశ్రీ సుబ్బారావు అయ్యాడు.

❋

## రాంగ్ ట్రాక్

'తరుణ్' ని గురించి పరిశ్రమలో రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. రెండు సంవత్సరాల వరకూ ఖాళీ లేదు. కథ మమ్మీకి వినిపించండి. అడ్వాన్సు ఇంత ఇవ్వండి ఇన్ని కాల్షీట్సులోనే సినిమాని పూర్తి చేసుకోండి అంటూ ఏవేవో కండిషన్ల వర్షం కురిపిస్తున్నాడట. అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి 'తరుణ్' హీరోగా ఎంతకాలం ఉంటాడు అనేది ఇంకా రెండు మూడు సినిమాలొస్తేగాని చెప్పలేం. ఈలోగా కంగారెందుకూ?

